18052024-DIS-04_Layout 1 5/18/2024 1:56 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# అన్నదాత గుండె చప్పుడు వినాలె



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

**తెలంగాణ తెచ్చిన మలి ఏడాది. వసంత కాలం. అప్పటి టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులను ఎన్నుకొనే తంతు జోరుమీదుంది. మెదక్ జిల్లా అధ్యక్షున్ని ఎన్నుకునే ప్రక్రియ అది. కార్యస్థలం మెదక్ పట్టణం. బాధ్యుడు హరీశ్‌రావు. శోధకుడు పోచారం శ్రీనివాసరెడ్డి (అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి). అప్పటి మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ధూం ధాం ఏర్పాట్లు చేశారు. తెల్లారితే కార్యం.. కానీ, కోడికూత పొద్దుకు జడివాన కొట్టింది.. వడగండ్లు పడ్డయి. పూల దండలు, డప్పు, దరువులతో మెదక్ అంతా రంజు మీదుంది. హరీశ్‌రావు వచ్చారు. కానీ, కారు ఆగలేదు. అందులోనే పోచారం ఉన్నరు. కారు నర్సాపూర్ చౌరస్తా దాటింది.. సభావేదిక మళ్లింది. మంబోజిపల్లి, కొత్తపల్లి దాటి పాపన్నపేట మండలం కుర్తివాడ ఏటిగడ్డ పంట పొలాల్ల ఆగింది. నేను, నాతో పాటు అప్పటి సాక్షి టీవీ స్టాఫ్ రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి మంత్రి కారును వెంబడించినం. అప్పుడు నేను ఓ పత్రికకు ఉమ్మడి మెదక్ జిల్లా బ్యూరో ఇన్‌చార్జిగా పని చేస్తున్న.**



అది ఏటిగడ్డే కానీ బోర్ల కింది కాపురం. ఎప్పుడూ బోర్ల పడ్డట్టే ఉండేది. రైతుది నిత్తె గుంజాటన. సేతానం సేతికొచ్చేదాక మిడుకుడు బతుకే. ఎగిలివారంగ పడ్డ వడగండ్ల వానకు ధాన్యం తడిసింది. పొలం మీది వడ్లు రాలినయి. వెన్ను విరిగిన పంటచేను చూసి సేద్యకారులు గుండెలు బాదుకుంటున్నరు. గొంతు పొలమారి పోయేటట్టు వగపోస్తున్నరు. అగో..! వాళ్ల వెన్ను తట్టనికే హరీశ్‌రావు వచ్చిండ్రు. పొలాలన్ని కలియ తిరిగిండు. కల్లం మీది వడ్లు చూసిండు. 'అంకుల్.. మీరు అధికారులను అలర్టు చేయండి.. నేను ముఖ్యమంత్రి గారితో మాట్లాడుత' అని అన్నరు హరీశ్‌రావు. ఎవరి ఫోన్లో వాళ్లు మంత్రాంగం నడిపింండ్రు. తడిసిన ధాన్యం, రంగుమారిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రాలిన వరికి పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టు హరీశ్ అదే పంటపొలంలో ప్రకటించారు. ఎల్లమ్మ అనే మహిళ హరీశ్‌రావు కాళ్ల మీద పడ్డది. రెండు చేతులు పట్టి లేపితే.. ఎద నిండా హత్తుకున్నది. అప్పటికీ ఆమె దుఃఖంతో ఎగపోస్తూనే ఉన్నది. గుండె నిబ్బరం తాలూకు వగపోత అది.

2014-15లో అంటే టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రెండు సీజన్లకు కలిపి 35 లక్షల ఎకరాల్లోనే వరి సాగు ఉండేది. కేసీఆర్ కొలువు కూటం ఎక్కినంక మిషన్ కాకతీయ, కాళేశ్వరం, కల్వకుర్తి ఎత్తిపోతల, భీమా, నెట్టెంపాడు, సీతారామ సాగర్ ప్రాజెక్టులు జీవం పోసుకున్నయి. వాటికి ఉచిత కరెంటు, రైతుబంధు తోడైనయి. ప్రకృతి తోడ్పాటునిచ్చింది. అన్ని కలగలిసి పంజాబ్‌ను తలదన్నేంత పంట కాదు, భూమికి బరువయ్యేంత పంట పండింది. ఇది ఎంతవరకు ఎదిగిందంటే! కేసీఆర్ దిగిపోయే నాటికి అనగా.. 2022-23 నాటికి ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి ఏకంగా 1.22 కోట్ల ఎకరాలు సాగై 3 కోట్ల టన్నుల ధాన్యం వచ్చింది. పోయిన యాసంగిలో 1.20 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి ఎల్లింది.

ఇప్పుడు కాలం మారింది. కాల్వ ఆగింది. సాగు భూమి తగ్గింది. అంతా కలిపి యాసంగికి 65 లక్షల ఎకరాలే సాగయ్యాయి. దీంట్లె పొట్ట మీద నీళ్లు లేక, అదును మీద కరెంటు రాక లక్షన్నర ఎకరాలు బొందవడ్డది. అకాల వర్షాలు, వడగండ్లతో మరో 50 వేల ఎకరాలు పోయింది. ఈత కొయ్యల కష్టాలన్ని దాటుకొస్తే.. ధాన్యం 85 లక్షలు టన్నులు మించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆటపాటల మీద ధాన్యం కొనుగోలు చేయవచ్చు. కానీ, దీన్ని కూడా కొనలేని దైన్యం పాలకులది. సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటం, వరుసగా కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యం, దొడ్డు వడ్ల మీద ముఖ్యమంత్రి ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది.

రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తే.. అందులో సన్నాలు 8 నుంచి 10 లక్షల టన్నులకు మించవు. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో, కామారెడ్డి జిల్లాలో 63 వేల ఎకరాల్లో, మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణా తీరం వెంట ఒక లక్ష ఎకరాలు, నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ కింద 2 లక్షల ఎకరాల్లో సన్నాలను పండించారు.

డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడం వల్ల మిల్లర్లు, వ్యాపారులు నేరుగా కల్లాల మీదకు ఎగబడ్డరు. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వ్యాపారులు వచ్చి కొంటున్నారు. పచ్చి వడ్లకు క్వింటాల్‌కు రూ.2,700 నుంచి రూ.3,000 వరకు నగదు పెట్టారు. ఇది కొంత మెరుగైన ధరే కావటం, ఒకటి రెండు రోజుల్లో డబ్బు చేతికి వస్తుండటంతో.. రైతులు కూడా విక్రయిస్తున్నారు. 80 శాతం సన్నాలను వ్యాపారులు, మిల్లర్లే కొనుగోలు చేశారు. మిగిలేవి 20 శాతం. దీనికి మాత్రమే బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పటం అభ్యంతరకరం. రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు పెట్టి 75.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, మద్దతు ధర, కొనుగోళ్లు రైతులను ఆదుకునే స్థాయిలో లేవు. అకాల వర్షాలు ఆగం చేసినయి. కల్లాల మీది ధాన్యం, కాంటాకు తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. ఈ ధాన్యానికి మద్దతు ధర ఇవ్వకుండా, కొనుగోలు చేయకుండా తాత్సారం చేయటంపై రైతాంగం మండిపడుతున్నది.

**'మార్కెట్ తెరిపించురి సారు' అని ఒక మహిళ ఇటీవల పోలీసుల కాళ్లు మొక్కుతున్న దృశ్యం జనగామ మార్కెట్ యార్డులో కనిపించింది. అది ధాన్యానికి మద్దతు లేని రైతు దైన్యానికి సచిత్రిక. ఆ వలపోత ప్రతి హృదయాన్ని తాకింది. తొలి ముఖ్యమంత్రి హృదయాన్ని కదిలించింది. తాను రైతుల పక్షం నిలబడ్డడు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చిండు. అన్నదాత గుండె చప్పుడు పాలకులు వినాలె. ఏ ఒక్క రైతు గుండె ఆగిపోకముందే మద్దతు ధరతో ప్రతి గింజను కొనుగోలు చేయాలె.**

## ఎటమటం




### మేమన్నది మీ గురించి కాదు!

రాష్ట్ర విభజన జరిగితే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యవాదులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వేర్వేరు రాష్ట్రాలుగా విడిపోయాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు నవంబర్‌లో ప్రశాంతంగా జరిగాయి. ప్రస్తుతం ఏపీలో పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అక్కడ జరిగిన అల్లర్లతో శాంతిభద్రతలు క్షీణించిపోవడంతో ప్రాణభయంతో కొందరు నాయకులు హైదరాబాద్‌లో తలదాచుకున్నట్టు వినికిడి. మరి తెలంగాణ ఏర్పడితే శాంతిభద్రతలు క్షీణిస్తాయని అప్పట్లో అన్నారు కదా? అని అడిగితే 'శాంతిభద్రతలు క్షీణిస్తాయని అన్నమాట నిజమే కానీ అది మీ దగ్గర కాదు, మా దగ్గర' అని బుకాయిస్తారేమో!




### డామిట్ కథ అడ్డం తిరిగింది..

ఎన్నికల బడలికతో కాస్త రిలాక్స్ అవుదామనుకున్నారో లేక మరేదైనా పనిమీద బయలుదేరారో కానీ, విమానానికి సాంకేతిక సమస్య తలెత్తడంతో ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు అడ్డంగా బుక్కయ్యారు. ఆ జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు విమానంలో వెళ్తున్న వారి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వారు విశ్రాంతి కోసమే వెళ్తున్నారా? లేక క్యాంప్ రాజకీయాలకు వెళ్తున్నారా? అన్న అనుమానాలు రేకెత్తాయి. ఎందుకొచ్చిన గొడవని అనుకున్నారేమో, తెల్లారేసరికి వారంతా హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. మంత్రి పొంగులేటి ఏకంగా సీఎం సమీక్షా సమావేశంలో కనిపించేసరికి, 'అయ్యో మీరు టూర్‌కు వెళ్లలేదా?' అని కనిపించినవారంతా ఆశ్చర్యంగా ప్రశ్నిస్తే.. 'ఇంకెక్కడి టూర్' అని ఆయన వాపోయారట.




### ఇదీ సంగతి

పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త, పాత నాయకుల మధ్య సమన్వయం లోపించడం వల్ల చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరిలలో పరిస్థితి ఆశాజనకంగా ఉండకపోవచ్చని కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీ నివేదిక ఇచ్చింది. ఇంతకు ఈ కమిటీ పరోక్షంగా చెప్పదలుచుకున్నది ఏమిటంటే.. ఈ మూడు సీట్లకు నీళ్లు వదులుకోక తప్పదని. 'కమిటీలో ఉన్నదే ఐదుగురు. ఎక్కడికి వెళ్లి సర్వే చేసి ఆ విధంగా నివేదిక ఇచ్చారు' అని ఓ అభ్యర్థి ఫోన్ చేసి మండిపడినట్టు కమిటీ సభ్యుడొకరు గాంధీభవన్‌లో వాపోయారు.




### ఎంత ప్రేమో!

పార్లమెంట్ ఎన్నికల్లో తమకు 12 సీట్లు వస్తాయని బీజేపీ, బీఆర్ఎస్ అంటే, తమకు 13 సీట్లు వస్తాయని కాంగ్రెస్ చెప్పింది. మొత్తం 17 సీట్లకు గానూ అన్ని పార్టీలు ఎంఐఎంకు ఒక సీటు వదిలేసి మిగతా 16 స్థానాలనే లెక్కలోకి తీసుకొని తమకు 12 లేదా 13 సీట్లు వస్తాయని చెప్తున్నాయి. మరి మిగతా మూడు లేక నాలుగు సీట్లలో ఏ పార్టీ గెలుస్తుందో మాత్రం చెప్పడం లేదు. అంటే ప్రత్యర్థి పార్టీకి కూడా ఓ రెండో, మూడో సీట్లు వదలకపోతే ఎలా అని జాలి చూపిస్తున్నాయన్న మాట.

\- వెల్జాల

# కొంపముంచిన 'చార్ సౌ పార్'!



మాలోతు సురేష్
98856 79876

**దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. ఇప్పటికే నాలుగు దశల పోలింగ్ ముగియగా.. ఐదో దశకు సన్నాహాలు జరుగుతున్నాయి. కానీ, ఇప్పటికీ ఏ పార్టీ జెండా ఎగురుతుందో, ఏ కూటమి అధికార కుర్చీపై పాగా వేస్తుందనే విషయం మాత్రం అంచనాలకు అందడం లేదు. 'చార్ సౌ పార్' అని గప్పాలు కొట్టిన బీజేపీ అందులో సగం సీట్లు సాధించినా అది ఆ పార్టీ గొప్పేనని మాత్రం కచ్చితంగా చెప్పగలను.**



మోదీ సర్కార్ పట్ల బలమైన వ్యతిరేకత ఉందా అంటే పూర్తిస్థాయిలో లేదు. వ్యతిరేకత లేనంత మాత్రాన ప్రజలు మరోసారి బీజేపీకి అవకాశం ఇస్తారా? అంటే అదీ చెప్పలేని పరిస్థితి. మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చేంత అనుకూల వాతావరణం లేదనేది సుస్పష్టం. మోదీ ప్రభుత్వం పట్ల బలమైన అనుకూల భావన గానీ, వ్యతిరేకత గానీ లేనందున ప్రజలు ప్రత్యామ్నాయంగా ఉన్న ఇండియా కూటమికి అవకాశం ఇస్తారా? అంటే అదీ శూన్యమే. ఎన్డీయే కూటమికి గత ఎన్నికల్లో వచ్చిన సీట్లలో భారీగా కోత పడటం ఖాయమని మాత్రం కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే గత ఎన్నికల్లోనే బీజేపీ తన అనుకూల ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్, యూపీ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నది. మళ్లీ ఆ రాష్ట్రాల్లో అదే స్థాయిలో సీట్లు గెలిచే అవకాశాలు కనిపించడం లేదు. ఇక ఆ పార్టీ 2019 ఎన్నికల నాటి మెజారిటీ స్థానాలను ఇప్పుడు దాటాలంటే ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాలపైనే ఆధారపడాలి. కానీ, ఆ రాష్ట్రాలు బీజేపీకి మద్దతిస్తాయా అంటే ఆ పరిస్థితులు అంతంతమాత్రమే.

'చార్‌సౌ పార్' అన్న బీజేపీ నినాదం.. అభూత కల్పనేనని తొలి నాలుగు విడతలతోనే స్పష్టమైంది. 2024 ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచి వికసిత భారత్ అని ప్రచారం చేసిన బీజేపీ.. ఆ తర్వాత ఊసరవెల్లి వలె రంగు మార్చింది. మళ్లీ తన పాత పద్ధతిలోనే ప్రచారాన్ని సాగిస్తున్నది. హిందూ- ముస్లిం, అయోధ్య రామ మందిరం, పాకిస్థాన్, ఆర్టికల్- 370, కశ్మీర్, బాలాకోట్.. అంటూ పాత రాగాన్నే అందుకున్నది. అయితే ఆ నినాదాలకు కాలం చెల్లింది. రామమందిరం ముగిసిన అధ్యాయం. అందుకే తమను గట్టెక్కించే బలమైన నినాదం కోసం ఆ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ తరుణంలో ఆ పార్టీకి నీటిలో మునిగే వ్యక్తికి గడ్డిపోచ దొరికినట్టు 'హిందూ-ముస్లిం' నినాదమే మళ్లీ దిక్కయింది. అయితే ప్రజలు బీజేపీ ఎత్తుకున్న పాత నినాదాలు తమ బతుకులకు భరోసా కల్పించ వని కొట్టిపడేస్తున్నారు.

ఈ పాత నినాదాలు తమను గట్టెక్కించవని, తమ పుట్టి మునగడం ఖాయమని గ్రహించిన బీజేపీ నాయకులు ఈ ఎన్నికలను అధ్యక్ష ఎన్నికలుగా మార్చాలని చూశారు. 'మోదీ వర్సెస్ రాహుల్'గా చేయాలని మొదటి నుంచి విఫలయత్నం చేశారు. తద్వారా దేశ ప్రధానిగా రాహుల్‌గాంధీ కంటే మోదీనే సరైన వ్యక్తి అనే ప్రచారాన్ని ముందుకు తేవాలని ప్రయత్నించారు. అందులో భాగంగానే ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి లేరని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ వ్యూహాన్ని ముందే గ్రహించిన ఇండియా కూటమి.. బీజేపీ ట్రాప్‌లో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించింది.

ఒకప్పుడు ఉన్నట్టు.. మోదీని చూసి ఓట్లు వేసే పరిస్థితులు ఇప్పుడు దేశంలో లేవు. ఎందుకంటే, పాశ్చాత్య దేశాల వలె ఇవి అధ్యక్ష ఎన్నికలు కావు. ఎంపీ అభ్యర్థి, ప్రాంతీయ ఆకాంక్షలు, స్థానిక సమస్యలు ఈ ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. మొత్తంగా మరోసారి అధికారంలోకి రావాలని శతవిధాలా ప్రయత్నిస్తున్న బీజేపీ పాచికలు పారడం లేదు. బీజేపీయేతర నాయకులపై ఆ పార్టీ చేస్తున్న అవినీతి ఆరోపణలు కూడా పనిచేయడం లేదు. ఎందుకంటే, ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న నాయకులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారే. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమంటే.. అవినీతి ఆరోపణలు చేసిన కమలనాథులే సదరు నాయకులకు బీజేపీ కండువాలు కప్పుతుండటం విడ్డూరం. అందుకే ఆ పార్టీ ఎప్పుడో విశ్వసనీయతను కోల్పోయింది.

కాంగ్రెస్‌తో సహా ప్రాంతీయ పార్టీలను కుటుంబ పార్టీలంటూ చేసిన విమర్శలను ప్రజలు పట్టించుకోవడం లేదు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోకపోగా, అతని కుమారుడికి పార్టీ టిక్కెట్ ఇవ్వడం శోచనీయం. ఇలాంటి మరెందరో పరివార్ నేతలకు టికెట్లు ఇచ్చిన కమలం పార్టీ వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడే అర్హతను ఎప్పుడో కోల్పోయింది.

'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్టుగా.. తప్పుడు ప్రచారాలతో ప్రత్యర్థులపై పైచేయి సాధించే బీజేపీ ఇప్పుడు అవే తప్పుడు ప్రచారాలకు బలవుతున్నది. '400 సీట్లు' అన్న నినాదమే ఆ పార్టీకి శాపంగా మారింది. అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను తొలగించేందుకే కమలం పార్టీ 400 సీట్ల లక్ష్యం పెట్టుకున్నదని ప్రతిపక్షాలు తమ అస్త్రంగా మలచుకున్నాయి. అదే సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో ఒకటి వైరల్‌గా మారడం కమలం పార్టీని ఇరకాటంలో పడేసింది.

**తమకు రిజర్వేషన్లు రద్దు చేయాలన్న ఉద్దేశం లేదని, తమ మ్యానిఫెస్టోలో ఆ అంశం లేదని చెప్తూ.. బీజేపీ నేతలు జరిగిన నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నం చేసినా అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది. పెద్ద నోట్ల రద్దు లాంటి అనేక నిర్ణయాలు మ్యానిఫెస్టోలో పెట్టకుండానే తీసుకున్నది. అందుకే, ఆ పార్టీని బడుగు, బలహీన వర్గాలు నమ్మడం లేదు. మ్యానిఫెస్టోలో పెట్టకపోయినా రిజర్వేషన్లను రద్దు చేస్తుందేమోనని భయం వారికి పట్టుకున్నది. ఈ నేపథ్యంలో కమలనాథుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది.**

బీజేపీ సంగతి ఇలా ఉంటే.. ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు చావో రేవో అన్నట్టుగా మారాయి. కాంగ్రెస్ బలహీనతలే బీజేపీకి బలమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మోదీ-షా వ్యూహాలను ఎదుర్కోవడం పక్కనపెడితే కనీసం స్థానిక నాయకుల వ్యూహాలకు ప్రతివ్యూహాలను రచించలేకపోయింది. ఎన్నికలకు ముందే ఆ పార్టీ చేతులెత్తేసింది. సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో బీజేపీ ఏకగ్రీవంగా ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నది. మరోవైపు ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నాటకీయ పరిణామాల మధ్య తన నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఫలితంగా ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ కనీసం పోటీలో లేకుండాపోయింది. పూరీలోనూ ఆ పార్టీ అభ్యర్థి పోటీ చేయలేనంటూ ముందే కాడి వదిలేయడంతో కాంగ్రెస్ పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది.

ఈ పరిస్థితుల్లో ఇటు ఎన్డీయే, అటు 'ఇండియా' హవా, వేవ్ లాంటివేవీ లేవనేది సుస్పష్టం. రెండు కూటమిలలో ఏ ఒక్కదానికీ మెజారిటీ వచ్చే అవకాశాల్లేవు. ఈ విషయాన్ని బెంగాల్, కేరళ సీఎంలు మమత, విజయన్ లాంటి నేతలు ముందే పసిగట్టారు. అందుకే ఇండియా కూటమితో అంటీముట్టనట్టుగా వ్యవహరించారు. ఈ తరుణంలో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు రెండు కూటములకు దూరంగా ఉన్న ప్రాంతీయ పార్టీల మద్దతు కీలకంగా మారనున్నది. రేపటి రోజున ఢిల్లీ పీఠంపై ఎవరు కూర్చోవాలో నిర్ణయించేది ప్రాంతీయ పార్టీలేనన్న విషయంలో సంశయం అక్కర్లేదు.

**'చార్‌సౌ పార్' అన్న బీజేపీ నినాదం.. అభూత కల్పనేనని తొలి నాలుగు విడతలతోనే స్పష్టమైంది. 2024 ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచి వికసిత భారత్ అని ప్రచారం చేసిన బీజేపీ.. ఆ తర్వాత ఊసరవెల్లి వలె రంగు మార్చింది. మళ్లీ తన పాత పద్ధతిలోనే ప్రచారాన్ని సాగిస్తున్నది. హిందూ- ముస్లిం, అయోధ్య రామ మందిరం, పాకిస్థాన్, ఆర్టికల్- 370, కశ్మీర్, బాలాకోట్.. అంటూ పాత రాగాన్నే అందుకున్నది.**

## మట్టి పొరలో పుట్టిన చరిత్ర



ఈ నేలను చూసి మురిసిపోయినం
బందీ అయినా నేల కోసం పోరాడిన
వీరులను చూసి మురిసిపోయినం

అమరులు నెత్తురద్దిన నేల
పోరాడి సాధించుకున్న
వీరుల త్యాగాల నేల

అమ్మానాన్నలు
అడుగులేసిన నేల
అన్నం పెట్టిన నేల
ఆకలి తీర్చిన నేల


సాధించుకున్న నేలను
చతికిల పడకొడుతుండ్రు
అమరుల యాదిమరుస్తుండ్రు
పోరాడిన వీరుల చరిత్ర
మట్టిలో కలిపేయచూస్తుండ్రు

మట్టి పొరలో నుంచి
పుట్టుకొచ్చిన చరిత్రలు
తుడిచేస్తే తుడుచుకుపోవడానికి
మట్టిలో రాసుకున్న అక్షరాలు కావు
మహనీయుల చరిత్ర

వీరుని చరిత్ర వీరునికే దక్కుతుంది
త్యాగధనుల చరిత్ర
త్యాగధనునికే ఉంటుంది
అమరుల చరిత్ర
అమరులకే దక్కుతుంది
ఎవ్వరు చెరిపినా
చెరగని చరిత్రలుగా మిగిలిపోతాయి
మట్టి పొరలో పుట్టిన చరిత్రలు



దేవరపాగ కృష్ణయ్య
99634 49579




## ప్రజల దృష్టిని మళ్లించడానికే!

*మన రాజ్యాంగానికి అతిపెద్ద ముప్పు పొంచి ఉన్నది బీజేపీ నుంచే. ప్రశ్నించేవారిని జైలులో పెట్టి భారత్‌ను పాకిస్థాన్‌లాగా మార్చాలని ఆ పార్టీ అనుకుంటున్నది. హిందూ-ముస్లిం, మనం ఏం తినాలో, ఏం తినకూడదో లాంటివన్ని ప్రజల దృష్టిని మళ్లించడానికే. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, స్వచ్ఛభారత్, స్కిల్ ఇండియా, ఫిట్ ఇండియా లాంటి అంశాల గురించి బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడరు?*



**- ఆదిత్య థాక్రే,** శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే